# ఫొటో-ఫ్రేమ్

-డి.కామేశ్వరి

'నమస్తే దాదిమా, పవిత్ర వుందా-' లోపలికొచ్చి రాజ్యలక్ష్మి కాళ్లకి దండంపెడ్తూ వినయంగా అడిగాడు విశ్వాస్.

'నీవా బాబూ, దా, కూర్చో. స్నానం చేస్తున్నట్లుంది, పిలుస్తా... రా నాయనా, ఇలా వచ్చి కూర్చో' ఆప్యాయంగా పక్కన కూర్చోమని ఆహ్వానించింది.

"ఇంకా స్నానంలోనే వుందా - శ్రవణ్‌ని తీసుకు స్కూలుకి వెళ్లాలని రమ్మంది-'

'నీలమ్మా - చిన్నమ్మగారికెళ్లి చెప్పు, విశ్వాస్ బాబు వచ్చారని-' పని మనిషికి చెప్పి

'చాలా రోజులయింది బాబూ వచ్చి, కనపడడమే మానేశావు-' అంది అభిమానంగా.

'ఎక్కడ దాదీమా - పదిరోజులు బొంబాయి వెళ్లాను - ఆఫీసునించి వచ్చేసరికే తొమ్మిది, ఆదివారాలు పై వూర్లకి వెళ్లడం, శ్రవణ్‌ని చూడడానికైనా కుదరడం లేదు.

'అంతేలే నాయనా, ఒక ఇంట్లో వుంటూనే మొగుడు పెళ్లాలు రాత్రిపూటే మొహాలు చూసుకునే రోజులు ఇవి. ఏం పాడు ఉద్యోగాలో, ఆడ మగ ఇద్దరికిద్దరూ ఎవరి దారి వారిదయిపోయింది." మాటలు విని లోపల్నించి వచ్చిన కళ్యాణి విశ్వాస్‌ని చూసి పలకరింపుగా నవ్వి 'విశ్వాస్, చాలా రోజులయింది వచ్చి' అంది- విశ్వాస్ ఆవిడ కాళ్లకీ దండం పెట్టి 'మా జీ, ఎలా వున్నారు - కాలేజీకి ఇంకా సెలవులు ఇవ్వలేదా-' అంటూ పలకరించాడు. 'పరీక్షలయినా మాకు పనులు ఇంకా వుంటాయిగా రిజల్ట్స్ ఎనౌన్స్ చేసేవరకు. వెళ్లిపోకు, ఫలహారం చేసి వెడుదుగాని దోశెలు వేస్తున్నాను' అంది. 'ష్యూర్, మీ చేతి దోశె తినడం ఒక ఆనందం. శ్రవణ్ ఏడి కనపడలేదు-' ఆరా తీశాడు. - 'శ్రవణ్' కళ్యాణి గట్టిగా పిలిచింది - తాతగారితో మేడమీద కూర్చుని టివిలో కార్టూన్ చూస్తున్న శ్రవణ్ మేడ మీదనించి విశ్వాస్‌ని చూసి 'డాడీ' అంటూ పరిగెత్తి కిందకి వచ్చాడు - విశ్వాస్ కొడుకుని ఎగరేసి ఎత్తుకుని గుండెలకి హత్తుకుని, బుగ్గమీద ముద్దు పెట్టాడు - 'ఏయ్, ఏం చేస్తున్నావు-' మురిపెంగా అడిగాడు.

'కార్టూన్ చూస్తున్నాను - డాడీ, ఫో, నీతో మాట్లాడను - లాస్ట్ సండే రాలేదు నీవు.'

'వూర్లో లేనురా, బొంబాయి వెళ్లాను - సారీ, వెరీ సారీ...' అన్నాడు విశ్వాస్ కొడుకు జుత్తు ప్రేమగా పైకి తోస్తూ- రెండు వేళ్లు మడిచి 'రెండు సండేలు ఆబ్సెంట్' అంటూ 'రెండు ఐస్‌క్రీములు బాకీ నాకు' ముద్దుగా చూపిస్తూ అన్నాడు. విశ్వాస్ నవ్వి 'ఓకే, గ్రాంటెడ్' అన్నాడు. మేడ మీద నించి దిగివస్తూ 'సారీ, వెయిట్ చేయించాను' అంటూ పవిత్ర హడావిడిగా అంది - అపుడే స్నానం చేసిన పవిత్ర ఎంతో ఫ్రెష్‌గా తాజా పువ్వులా చక్కని సువాసనలు వెదజల్లుతూ వచ్చిన ఆమెని ఒక్క క్షణం మైమరుపుతో చూస్తుండిపోయాడు - పసుపు రంగు హేండ్‌లూమ్ కుర్తా, నల్లరంగు సల్వార్, పైన నిర్లక్ష్యంగా వేసుకున్న పువ్వుల ఆరెంజ్ చున్ని, జుత్తుకు పెట్టిన క్లిప్, పల్చగా వేసుకున్న లిప్‌స్టిక్ భుజాన పెద్ద హ్యాండ్‌లూమ్ హేండ్ బ్యాగ్, చాలా క్యాజువల్‌గా, సింపుల్‌గా అలంకరించుకున్న పవిత్రలో ప్రత్యేకత అదే- నిర్లక్ష్యంగా ఏదో ఒక డ్రస్సు వేసుకొని హడావిడిగా తయారై వచ్చే పవిత్రలో ఆ నిర్లక్ష్య ధోరణి సింప్లిసిటీలో కనిపించడం ఆమెలో ప్రత్యేక ఆకర్షణ - తీర్చిదిద్దినట్టుండే వత్తయిన కనుబొమలు, వత్తయిన నల్ల జుత్తు, తెలుపు ఎరుపు కల్సిన దేహచ్ఛాయ, కొద్దిగా కోపం వచ్చినా, దుఃఖం వచ్చినా ఎర్రబడి పోయే ముక్కుచివర... హడావిడిగా పరిగెడ్తున్నట్టుండే నడక, కనిపించిన వారందరితో చేతు లూపుతూ పలకరించే స్నేహపూరిత చూపులు... చెప్ప దలచింది దాపరికం లేకుండా సూటిగా చెప్పేసే నిజాయితీ, ఏ సమస్య అయినా తెలివిగా పరిష్కరించగలిగే విజ్ఞానం పెద్ద కళ్లలో ప్రతిఫలిస్తూంటుంది - అలాంటి పవిత్రని చూసే ఆమె పట్ల ఆకర్షితుడైంది. అతని చూపు గుర్తించి కాస్తంత ఇబ్బంది పడ్తూ - 'వెడదామా... తొమ్మిది గంటలకి ఎపాయింట్‌మెంట్ ఇచ్చింది ప్రిన్సిపల్' అంది. 'ఉండవే, టిఫిను తిని వెళ్లండి'- దోసెలు పట్టుకొస్తూ అంది కళ్యాణి - 'టైము లేదమ్మా - తొమ్మిదికక్కడ వుండాలి - ఓ అరటిపండు వలుచుకుని తిని, జ్యూస్ గ్లాసులో పోసుకుని తాగింది. 'నీకక్కరలేకపోతే మానేయ్ విశ్వాస్ తింటాడు - 'ఆ అబ్బాయికి దోసెలిష్టం - కూర్చో విశ్వాస్' 'అబ్బ టైములేదు అమ్మా! జస్ట్ టూ మినిట్స్ - మమ్మీజీ బాధపడ్తారు తినకపోతే' విశ్వాస్ గబగబ తినడం మొదలుపెట్టాడు. 'మమ్మీవంక ఎందుకు, దోసెలంటే టెంప్టేషన్ అని చెప్పకూడదూ-' పవిత్ర అంది నవ్వుతూ.

'ఏమిటి హడావిడి, విశ్వాస్, నీవెప్పుడు వచ్చావు నాకెవరూ చెప్పలేదే- 'మేడమీద నించి కిందకి దిగివస్తూ అన్నారు రంగారావు - గబగబ ఫలహారం చేస్తూనే కాస్త వంగి ఆయన పాదాలు అంటీ అంటనట్టు నమస్కారం చేస్తూ 'సారీ, మీరు రాకుండానే టిఫిను తినేస్తున్నాను. శ్రవణ్ స్కూలు అడ్మిషన్ కోసం వెళ్లాలంటే వచ్చాను. మరోసారి కలుద్దాం... బై... కాఫీ వద్దు మాజీ...' గబగబ వాష్ బేసిన్ దగ్గిర చేయి కడుక్కుని పవిత్ర వెనకాతలే బయటికి నడిచాడు శ్రవణ్‌ని ఎత్తుకుని-

కారులో ఎక్కాక 'ఏ స్కూల్లో అడ్మిషన్ తీసుకొంటున్నావు - నాకేం చెప్పనే లేదు-' 'ఎక్కడ రెండుసార్లు ఫోను చేశాను, దొరకలేదు నీవు - రెండు స్కూల్సుకి అప్లై చేశాను. మొన్న ఒకదానికి వెళ్లొస్తే పేరెంట్స్ ఇద్దరూ రావాలంది ప్రిన్సిపల్ - స్టుపిడ్ ఉమన్ 'డైవోర్సీ' అన్నా, పేరెంట్స్ ఇద్దరూ వుండాలంటుంది. నాకు ఒళ్లు మండి ఏ మొగుడ్ని తీసుకురాను' అన్నా - ఆవిడగారి వాదన ఏమిటంటే సింగిల్ పేరెంట్స్ దగ్గర పెరిగే పిల్లల సైకాలజి కాస్త సరిగా వుండదుట...

'మే బి, షి ఈజ్ రైట్... కాని ఆ కారణంగా స్కూలు అడ్మిషన్ ఇవ్వననడానికి లేదుగా, తల్లి గార్డియన్‌గా వుండచ్చుగా-

'ఏమో ఆ స్కూలు రూల్సు నాకు తెలియవు - యిపుడు మనం వెళ్లేది 'లిటిల్ బడ్స్' స్కూలుకి - అక్కడ మనం డైవోర్సు విషయం చెప్పకపోవడం మంచిదేమో, అనవసరం కూడా అనుకుంటా - ఎందుకంటె ఎప్పుడైనా అవసరం అయితే పేరెంట్స్ మీటింగుకి దానికి రావడానికి నీకేం అభ్యంతరం వుండదుగదా. పిల్లాడు ఎక్కడ వున్నాడన్న ప్రశ్నకి తావు లేదుగదా డైవోర్సు తీసుకున్నాం అని చెప్పకపోతే ఏం.

'ఐ థింక్ యూ ఆర్ రైట్ - బాబు విషయంలో బాధ్యత మనిద్దరిది అని ముందే అనుకున్నాం గదా - ఎప్పుడు ఏ అవసరం వచ్చినా వాడికి నేనుంటాను- ఒళ్లో శ్రవణ్‌ని ముద్దుపెట్టుకుంటూ అన్నాడు. పవిత్ర తండ్రి కొడుకులని తృప్తిగా చూసింది-

'నర్సరీలో అడ్మిషన్ కింత తతంగం - పేరెంట్స్‌కి ఇంటర్వ్యూలు... డొనేషన్లు... టూ మచ్...' అంది పవిత్ర-

## మాట వరసకు మనిషే

విలువల మీద నడుస్తున్న వాడు
నాలుకపై చేదు పూసుకుని
ముఖాన్ని గంట్లు పెట్టుకుంటాడు

అపుడపుడు కొన్ని నిజాలు చెప్పినవాడు
గోడకు దబదబా తలకొట్టుకుని
అబద్ధాల కోసం చెవి ఆనిస్తాడు

వంకర ఆలోచనల వ్యూహంతో వాడు
తల చుట్టూ చేయిని తిప్పి
చూపుడు వేలితో ముక్కు చూపిస్తాడు

నటనలు బోలెడన్ని తెలిసిన వాడు
రంగులు అద్దుకుంటూ
పెద్దాళ్ని కూడా జోకొడుతుంటాడు

సిద్ధాంతమని ఒగర్చేవాడు
లెక్కలేనంత అలుపుని అదుముకుంటూ
చేతుల్తో భంగిమల్ని మార్చుకుంటాడు

పరువే ముఖ్యమని తలచినవాడు
ఇంటి చూరుకు వేలాడుతూ
మాసిన చొక్కా కాలరుకు సెంటు
పులుముకుంటాడు.

నా అంతటి వాడ్ని నేనే అనుకున్నవాడు
శిఖరాధిరోహణం చేస్తూ
కనుబొమ్మల్ని ఎగరేస్తాడు

కళ్ళల్లో నిప్పుల్ని దాచుకున్న వాడు
అసూయాగ్నిలో మాడిపోతూ
మనోయవనికల్ని చీల్చి పారేస్తాడు

పగని గుండెల్లో దాచుకున్నవాడు
కత్తుల మొనల్ని సానబెట్టుకుంటూ
నెత్తురును భాషకు అంటిస్తాడు

స్వభావాల్ని అంగాల వారీగా పేర్చి
మాటవరసకు మనిషే అంటున్నాను
నమ్మండి మరి.

-దాట్ల దేవదానం రాజు

'సారీ, ఈ పూట ఆఫీసుకి లేటవుతావు. సారీ ఫర్ దట్. ఈ రోజు నేను సెలవు తీసుకొన్నాను."

"సరే ఎలాగూ లేటవుతాను - నేనూ ఆఫ్ తీసుకుంటాను. శ్రవణ్‌ని తీసుకుని ఎటన్నా వెళ్ళి హోటల్లో భోంచేసి వద్దాం - చాలా రోజులయింది వాడితో గడిపి-' విశ్వాస్ అన్నాడు.

'డాడీ... ఐ లవ్ యూ డాడీ' శ్రవణ్ సంతోషంగా తండ్రి మెడ కావలించుకున్నాడు.

❖ ❖ ❖

'లేచావా, టీ పెట్టనా, చాలా సేపు పడుకుండి పోయావు - ఆఫీసుకి సెలవు పెట్టావా?

"ఎండలో తిరిగి వచ్చేసరికి మత్తు నిద్ర వచ్చేసింది. - ఎలాగో ఆలస్యం అయిందని విశ్వాస్. నేను సెలవు పెట్టి మార్నింగ్ షోకి శ్రవణ్‌ని తీసుకువెళ్ళి, హోటల్లో భోంచేసి వచ్చాం... ప్లీజ్ నాకూ టీ ఇవ్వవా, మామ్మా' ఆవులిస్తూ అంది పవిత్ర.

'చేస్తున్నాను, తీసుకొస్తానుండు-' ఆవిడ లోపలికెళ్ళి రెండు కప్పుల్లో టీ తెచ్చి డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుంది రాజ్యలక్ష్మి - టీ తాగుతున్న మనవరాలిని ఏదో అడగాలన్న ఆరాటం కనిపించింది.

'శ్రవణ్‌కి సీటిచ్చారా-' ఒకటి అడగబోయి మరోటి అడిగింది- 'విశ్వాస్ నెందుకు తీసికెళ్లావు-' ఏం తెలీనట్టే అడిగింది.

"నర్సరీ క్లాసు సీటుకి పెద్ద హడావిడి... పేరెంట్స్ ఇద్దరూ రావాలిట ఇంటర్వ్యూకి. అందుకే రమ్మన్నాను."

"అంటే, తండ్రి లేకపోతే పిల్లలకి స్కూలులో సీటివ్వరా-" అమాయకత నటించింది.

"స్టుపిడ్ రూల్సు వాళ్లూనూ - నేనడగలేదు - అడగాలంటే, అడిగి, వాదన పెట్టుకుని వాళ్ళని దబాయించి సాధించుకోగలను - సరే, విశ్వాస్ ఎలాగూ బాబుని కలుస్తూనే వున్నాడు, రమ్మంటే రానన్నడు, ఎందుకొచ్చిన గొడవ, నాకు ఓపిక లేదు ప్రతివాళ్లకి చెప్పి వాళ్లని ఒప్పించడానికి' విసుగ్గా అంది పవిత్ర.

'అంటే వాళ్ల ఉద్దేశంలో పిల్లలకి తల్లి తండ్రి ఇద్దరి అవసరం వుంటుంది, కుటుంబ వాతావరణం బాగుండాలి పిల్లలు బాగా చదవాలంటే అనేమో-' గడుసుగా అంది ఆవిడ.

'ఏం, సింగిల్ పేరెంట్స్ దగ్గర ఎంతమంది పిల్లలు లేరు - వాళ్లంతా చదవడం లేదేమిటి. ఏవో వాళ్ల రూల్సు, రెగ్యులేషన్స్ మన నెత్తిన రుద్దుతారు.

రాజ్యలక్ష్మి మనవరాలి వంక ఓ క్షణం చూసి 'పవిత్రా, నిన్ను, విశ్వాస్‌ని చూస్తుంటే నాకెంత ఆశ్చర్యంగా వుందో. మీరిద్దరూ ఇంత చక్కగా మాట్లాడుకుంటారు, తిరుగుతారు, నవ్వుతారు - మిమ్మల్ని చూస్తే డైవోర్సు అయిన జంటలాగే అనిపించదు - ఇంత చక్కగా కల్సిపోయిన మీరు విడిపోవడం ఏమిటో నాకర్థం కాదు - విశ్వాస్ ఎంత మంచివాడు - ఎంత అణకువ, నమ్రత, గౌరవం, మనం అంటే ఎంత అభిమానం..."

'అవునవును, కనపడగానే వంగి కాళ్లకి దండాలు పెడ్తూంటాడు గదా. దాదీమా అంటూంటాడుగా - అందుకే నీ కిష్టం... ఇంతకీ అతను మంచివాడు కాదని నేననలేదుగా' - నవ్వుతూ అంది.

"మరి అయితే విడాకులెందుకు తీసుకున్నట్టు, నిక్షేపంగా కాపురం చేసుకోకుండా-"

"మొగుడిగా నాకు నచ్చలేదు, ఫ్రెండ్‌గా ఓకే, భర్తగా నాకు కావాల్సిన విధంగా లేడు కనుక విడిపోయాను... భర్తగా నన్ను సపోర్ట్ చేయాలి గదా, చేశాడా' ఎదురు ప్రశ్న వేసింది.

'ఏమిటోనమ్మా, నీ మాటలు నా కర్థంకావు - మంచివాడే అంటావు - చక్కగా మాట్లాడుకుంటున్నారు - మరి ఏం వచ్చిందే కల్సి వుండడానికి - మరీ వింతగా వున్నాయి తల్లీ నీ మాటలు - ఏం పిల్లలో, ఈ కాలంలో ఉ అంటే - డైవోర్సులు, అ- అంటే విడిపోవడాలు - సంపాదన చూసుకుని అమ్మాయిలు మరీ మిడిసిపడుతున్నారు - లోపాలు లేని మనిషి వుంటాడా లోకంలో. శ్రీరామచంద్రుడంతటి వాడిని చాకలి మాటలు విని పెళ్లాన్ని వదిలేశాడు అనలేదూ.'

'మామ్మా నీకు తెలీదు, ఈ మగాళ్లు పెళ్లి కానంత వరకు చక్కగా ఫ్రెండ్లీగా అమ్మాయిలను ఇంప్రెస్ చేస్తూ తిరుగుతారు - పెళ్లి, మొగుడు అనగానే ఒక ఫ్రేంలో గిరి గీసుకుని ఆ చట్రంలో బిగిసిపోయి 'ఇగోలు' పుట్టుకొస్తాయి - ఇప్పుడు నేను ఇంక పెళ్లాన్ని గాదుగా అంచేత చక్కగా వుంటాడిప్పుడు - పెళ్లాం అనగానే ఎక్కడా లేని ఎక్స్‌పెక్టేషన్స్ వుంటాయి మగాళ్లకి...

"ఏం, మీకు లేవా మొగుడు గీసిన గీటు దాటకుండా చెప్పినట్లుండాలి అని... మొగుడు నించి పెళ్ళాం, భార్య నించి మగాడు తమ స్వంతం అనుకునేసరికి యిలా వుండాలనుకోడం తప్పులేదు - స్వంతం అనుకుంటే గదా అనే హక్కు వస్తుంది - వూర్లో వాళ్లు ఇలా వుండాలనుకుంటారూ - వాళ్లనంటామా - అనిపించుకుంటామా-'

'నీకేం తెలీదు మామ్మా -' విసుగ్గా అంది పవిత్ర.

'నాకన్నీ తెలుసే అమ్మడూ - కాస్తో కూస్తో చదువు ప్రపంచ జ్ఞానం వున్నదాన్నే - మీలా ఉద్యోగాలు చెయ్యలేదుగాని, మా కాలంలో ఇంటర్ చదివానంటే, ఇప్పుడు మీ బోడి ఎమ్మేలు పనికి వస్తారా మా ముందు - అదలా వుంచు, ఇందాక ఏదో ఫ్రేమ్, పరిధి అన్నావు చూడు - 'పెళ్లి' అనే పటానికి ఫ్రేమ్‌లో బిగించి అద్దం కట్టించాలే అమ్మా. అద్దంలేని, ఫ్రేమ్ లేని ఫోటో నాలుగు రోజులలో వెలిసి, మాసి, దుమ్ముకొట్టి, ముడతలు పడి రూపురేఖలు కోల్పోతుంది. పెళ్లి అనేది నాలుగు కాలాల పాటు నిలవాలంటే ఫోటోని భద్రంగా అద్దం కట్టించి కాపాడుకున్నట్టు భార్యా భర్త ఫ్రేమ్ అనే సంసార చట్రంలో యిమిడిపోవడానికి 'అహాన్ని' అద్దానికింద దాచేస్తే భార్యా భర్తల సంబంధం నిలుస్తుందే అమ్మా..."

పవిత్ర మామ్మ వంక విస్మయంగా చూసి 'భలే పోలిక చెప్పావులే. వెల్ సెడ్... యూ ఆర్ గ్రేట్... ఓహో కాలికి మెడకి ముడిపెట్టడం ఇదే గాబోలు-, చట్రం... అన్న మాటకి ఢెఫినిషన్ బలే ఇచ్చావులే, గుడ్, థాంక్స్ ఫర్ యువర్ గ్రేట్ థింకింగ్... విశ్వాస్‌కి చెప్పకే...' నవ్వుతూ అంది.

'నీ పొగడ్తల కోసం కాదులే చెప్పింది- కాస్త ఆలోచిస్తావని - విశ్వాస్ లాంటి మంచి అబ్బాయి నీకెక్కడ దొరుకుతాడే - దొరికినా కొత్తో వింతలాగ నాలుగు రోజులే ఆ ముచ్చట, మళ్లీ నా మీద శ్రద్ధలేదు, ప్రేమలేదు అంటూ మొదలెట్టవా-'

'ఉండు మామ్మా, గోల ఆపు... ఎన్నిసార్లు జరిగాయి ఈ చర్చలు ఇంట్లో-' విసుగ్గా అంది-

## నానీలు

కడివెడు కఠిన
కవిత్వం ఓ వైపు
గరిటెడు నానీ
మరోవైపు

జలం, ప్రవాహంగా
ప్రాణ దాత
సునామిగా
జీవహరిత

ఆకాశానికి చిల్లులు
సముద్రపు ఎల్లలు
జల దిగ్బంధంలో
ముంబయి

తండ్రి సాలుసరి జీతం
కొడుకు నెల వేతనం
ఔరా
ఐ.టి. మహిమ!

నాడు బతకలేక
బడిపంతులు
నేడు బతకనేర్చి
బడిపంతులు

మేధో మథనం
కర సంచాలనం
జీవన యానంలో
సమన్వయమే జయం

వ్యసనం చీడ,
ఒళ్ళు, ఇల్లు గుల్ల
తెలిసీ
అడుసు తొక్కనేల

గల్లీలో రౌడీల
విజృంభణ
ప్రపంచంలో
అమెరికా అకృత్యాలు

ఆస్తి ఎంత
ఉందని కాదు, ఎలా
వచ్చిందన్నదే
కీలకం

ప్రపంచీకరణతో
బాగుపడింది
బడుగులా
బహుళజాతి సంస్థలా

నా బాల్యంలో
క్యాలిక్యులేటరే తెలీదు
మా బుజ్జిగాడికి
కంప్యూటరు!

వేగం వెంట పరుగు
గమ్యం ఎండమావి
ఆచి తూస్తేనే
అందల సోపానం

-అంబల్ల జనార్దన్

'ఎన్నిసార్లు జరిగినా.. నీ మనసు మార్చగలిమా - అసలు నీవిక్కడ ఉన్నన్ని రోజులూ నీకు ఇబ్బంది తెల్సి రాదు - వేరే ఇల్లు తీసుకుని కొడుకుని పెట్టుకు వుంటే తప్ప వంటరిగా వుండే ఇబ్బందులు అర్థంకావు - ఇంట్లో ఏ బాధ్యత లేకుండా అమ్మా నాన్న చూస్తుంటే దర్జాగా ఉద్యోగం వెలగబెడుతూ ఝూం అని ఫ్రీగా తిరిగి వస్తున్నావు - మనవడిని ముద్దుగా చూసుకునే తాత అమ్మమ్మల సంరక్షణలో వుంచినన్నాళ్లు నీకేం లోటు కనిపించదు - వేరే వుంటే మొగుడి అవసరం ఈపాటికెప్పుడో అర్థం అయేది-' దెప్పిపొడిచింది.

"మరింకేం నీ కొడుకుతో చెప్పు నన్నింట్లోంచి పంపించేయమని-' తేలిగ్గా నవ్వి అంది.

'నీ అంత మొండిదాన్ని చూడలేదు తల్లి - అసలు మీ అమ్మ, నాన్నలని అనాలి, అలా నీ ఇష్టానికి నిన్ను వదిలేసి నిమ్మకు నీరెత్తినట్టు వూరుకున్నందుకు...' ఆవిడ కోపం కొడుకు మీదకి తిరిగింది.

❖ ❖ ❖

"ఏం చెయ్యమంటావమ్మా, చిన్న పిల్లలా కేకలేసి చెప్పి వప్పించడానికి - చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు, వాళ్లకి మనం ఏం చెప్పాలి-' కాస్త బాధ, నిర్లిప్తత కలిపి అన్నారు రంగారావు. పవిత్ర ఇంటికొచ్చేశాక, రాజ్యలక్ష్మి, 'ఏమిటిరా నాయనా, ఎవరి పాటికి వాళ్లు అలా ఏం పట్టనట్లూరుకున్నారు నిశ్చింతగా-" అన్న తల్లి మాటలకి కొడుకు జవాబిది.

"ఇంట్లో ఇంతమంది పెద్దవాళ్లం వుండి చక్కదిద్దే ప్రయత్నం చెయ్యొద్దా - దాన్ని కూర్చోపెట్టి కాస్త నయానో, భయానో నచ్చచెప్పాలి-' రాజ్యలక్ష్మి ఆరాటంగా అంది.

"ఆ - నచ్చచెప్పడాలు. ఈ కాలం పిల్లలకు ప్రతి దానికి వాళ్ల దగ్గిర జవాబు రెడీగా వుంటుంది... అది గాంగా- ఏముంది... ఇద్దరికి కలవలేదు... ఫ్రెండ్లీగా విడిపోదామని నిర్ణయించుకున్నాం అని ఓ ముక్కలో తేల్చేసిందిగా మొదటిరోజే!"

"ఏమిటో ప్రేమ అన్నారు, మనసులు కలిశాయన్నారు, మనకి వాళ్లకి కుదరదు, నీవు అక్కడ ఇమడలేవు అని చిలక్కి చెప్పినట్లు చెప్పాంగదా - విందా - మన వాళ్లారికే అన్నారా కులం, గోత్రం, కుటుంబం అన్నీ చూసుకోవాలని... ఎవరి ఆచార వ్యవహారాలు ఎవరు మానుకుంటారు ఇంకోరి కోసం..." రాజ్యలక్ష్మి సణిగింది.

"ఏం చేస్తాం అమ్మా, పెద్దవాళ్లు ఎందుకు చెప్పారన్నది అర్థం చేసుకోవడం లేదు ఈ తరం. మంచి తోవ చూపిస్తాం అన్నా వెళ్లి వెళ్లి బురదలో దిగబడే వారిని ఏం చెయ్యగలం - అంటిన బురద కడుక్కోవలసింది వాళ్లేనని వాళ్లంతట వాళ్లు గ్రహించాల్సిందే."

'బానే వుంది - ఆ బురద వాళ్లతోటే పోదుగా, మన ఇంటికి వచ్చి అంటిస్తున్నారుగా. ఏం చేస్తాం, కన్న పాపానికి మనకూ తప్పదు ఇంటికి అంటినది కడుక్కోడానికి.'

ఈ సంభాషణ పవిత్ర కాపురం వదిలి ఇంటికొచ్చిన కొత్తలో జరిగింది - అంటే ఏడాదిన్నర గడిచిపోయింది - పరిచయం, స్నేహం, ప్రేమ ఒక ఏడాది - పెళ్లి, కాపురం రెండున్నర ఏళ్లు - మొత్తం మూడేళ్లలో అంతా ముగిసి గోడకి కొట్టిన బంతిలా వెనక్కి వచ్చింది - తేడా అల్లా ఒక్కర్తే వెళ్లి ఇద్దరయి పిల్లాడితో వచ్చింది- "కనీసం పిల్లాడి కోసమన్నా సర్దుకోవచ్చు... వాడికి తండ్రిని దూరం చేస్తావా-" అంటూ కల్యాణి కూడా మందలించింది- 'మరేం పరవాలేదు - వంటరిగానే చూసుకోగలను, తండ్రిని దూరం చెయ్యనులే, వారానికోసారి వచ్చిపోతుంటాడుగా... పిల్లాడి బాధ్యత ఇద్దరిదీ అని అనుకున్నాంలే-' తేలిగ్గా కొట్టిపారేసింది.

'పిల్లలు లేకపోతే ఓ రకం, పిల్లాడుండగా నీకు మళ్లీ పెళ్లి కష్టం అవుతుందన్నది ఆలోచించావా-' కల్యాణి నిలేసింది.

'అబ్బ, పెళ్లి కోసం ఎవడేడిచాడు- ఇంకో పెళ్లి చేసుకోవాలని నేననుకోవడంలేదు - విసుగ్గా అంది-' ఒకవేళ నాకెప్పుడన్నా చేసుకోవాలనిపించినా పిల్లాడు అడ్డు అనుకునేవాణ్ని చేసుకోను-' నమ్మకంగా అంది.

'పవిత్రా... మరోసారి బాగా ఆలోచించు- అన్నీ తెలిసి, అంగీకరించి అతన్ని చేసుకుని ఇప్పుడక్కడ ఇమడలేను అనడం బాగులేదు - విశ్వాస్ మంచివాడు అతన్ని వదులుకోడం ఫూలిష్‌నెస్-' రంగారావు కూతురికి నచ్చచెప్పే ప్రయత్నంలో అన్నారు.

"డాడీ, ప్రయత్నించాను గదా- రెండున్నర ఏళ్లు అనేక రకాలుగా ఎడ్జస్ట్ అవాలనే ప్రయత్నించాను. ఆ ప్రయత్నంలో మనశ్శాంతి పోగొట్టుకున్నాను. నేనెవరినీ బ్లేమ్ చేయడంలేదు. మనకు అలవాటులేని పరిసరాలలో సర్దుకోడం పెద్ద విషయంగాదు. విశ్వాస్ కోసం సర్దుకుపోవచ్చు అనుకున్నాను గాని, అనుభవంలోకి వచ్చాక గాని ఆ సర్దుబాటు అన్నది అంత సులువు కాదని తెలిసింది - మనశ్శాంతి లేకుండా, సిల్లీ విషయాలకి ప్రాముఖ్యం ఇస్తూ - వీటన్నింటి మధ్య నా ఉద్యోగం, కెరీర్ దెబ్బతినడం ప్రారంభించాక సర్దుబాటు అసంభవం అనిపించింది -" తండ్రికి తన మనోభావం విడమర్చి చెప్పింది.

"అందుకే కులం, ఆచార వ్యవహారాలు అన్నీ చూసుకోవాలని పెద్దలు అనుభవంతో చెప్పిన మాట, మీ పిల్లలకి అనుభవంలోకి వచ్చాక గాని అర్థంగావు. రాజ్యలక్ష్మి అంటించింది.

పవిత్ర విశ్వాస్‌ని చేసుకుంటానన్నప్పుడు - అతను మార్వాడి - జాయింట్ ఫేమిలీ - బిజినెస్‌లో తండ్రి ఇద్దరన్నదమ్ములు పార్ట్‌నర్స్ - తల్లి తండ్రి అన్నా వదిన అంతా కల్సి వుండే ఫేమిలీ - వాళ్ల ఆచార వ్యవహారాలు వేరు. కోడలంటే ఒద్దికగా, అణుకువగా యిల్లు వాకిలి చూసుకోవాలనే సాంప్రదాయం వారిది, ఇంట్లో అత్తగారున్నన్ని రోజులు పెత్తనం ఆవిడది- అజమాయిషీ, అధికారం అంతా ఆవిడది - కోడళ్లు అత్తచాటునే వుండాలనే నియమాలుంటాయి - నీవేమో కేర్‌ఫ్రీగా పెరిగిన దానివి, జాయింట్ ఫేమిలీలో వుండగలవా. డబ్బు, హోదా అన్నీ వున్నాయనుకో, వాళ్లలో ఉద్యోగాలు చేసే కోడళ్లు తక్కువ - అంగీకరించావా - అసలు అందరిలో కలిసి వుంగలననుకుంటున్నావా. ఆలోచించావా ఈ విషయాలు' కల్యాణి హెచ్చరించింది.

"విశ్వాస్ వాళ్లకి అన్నీ చెప్పాడమ్మా - నేను వాళ్లింటికెళ్లినపుడు ఇంత చదివి ఉద్యోగం లేకుండా వుండనని ఖచ్చితంగానే చెప్పాను - జాయింట్ ఫేమిలీ అనుకో, కాని మనుష్యులు మంచివాళ్లలాగే కనిపించారు. అన్నింటికీ పనివాళ్లున్నారు. నేను పొద్దుట వెళ్లి రాత్రి వస్తాను. ఇంక పెద్ద గొడవలు వచ్చేందుకు ఆస్కారం ఏముంటుంది. ఏ ప్రాబ్లమ్ వచ్చినా విశ్వాస్ చూసుకుంటానన్నాడు. విశ్వాస్ కోసం ఆ మాత్రం సర్దుకుపోగలననుకుంటున్నాను' పవిత్ర నమ్మకంగా అంది.

ఇంక చెప్పడానికేం వుంది - వద్దనడానికి తెలుగు వాళ్లు కాదన్నదొక్కటే అభ్యంతరకరం - ఎంబిఏ చేశారు - తండ్రి ఫార్మాసూటికల్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు - తండ్రి ఛైర్మన్ - పెద్ద కొడుకు మేనేజింగ్ డైరెక్టరు. పెద్ద ఇల్లు, కార్లు, హోదా వున్న కుటుంబం.

అంగరంగ వైభవంగా తమ తాహతుని మించి వారి తాహతుకి సరిపోయినట్లు పెళ్లిచేశారు రంగారావు, ఇటు అటు ఆచారాలు పద్ధతులు పాటించి - పెళ్లి అయిన మొదటి రాత్రి పవిత్ర నడుం పట్టేసినట్టు నటిస్తూ 'మీ అందరికి వెన్నెముకలు మెత్తగా వుంటాయా-?' అమాయకంగా అడిగింది నవ్వుతూ - విశ్వాస్‌కి అర్థంకాక తెల్లపోతూ చూశాడు.' లేకపోతే ఏమిటి బాబూ, రోజులో అన్నిసార్లు అలా సులువుగా వంగి పాదాభివందనాలు చేసేస్తారు. మనిషి కనిపిస్తే చాలు, ఎవరన్నా ఇంటికొస్తే, లేస్తే దండం, పడుకునే ముందు దండం, బయటికి వెడితే దండం, పండగొస్తే, పూజొస్తే, పెళ్లయితే సరే అలా టక్కున వంగి పాదాభివందనాలు అలా సులువుగా చేసేస్తుంటే సందేహం వచ్చింది - నాకు ఒక్కరోజుకే నడుం పట్టేసింది మీ వాళ్లలా దండాలు పెట్టేసరికి - బుంగమూతి పెట్టి అంది. విశ్వాస్ పకపక నవ్వాడు- 'చంపావు, ఇదా, ఇంకా ఏదో అనుకుని గాభరాపడ్డాను.

## హైకూలు

కొండ జొన్న మంచె మీద
వెలిగే నెగడి
అడవిలో లైట్‌హౌస్!

గంపల కావిళ్లతో
గొత్తె యువకుల ప్రయాణం
మిలట్రీ క్రమశిక్షణ!

ఇప్పపూల కోసం
ఎలుగుబంట్లతో పోరాటం
కోయపడుచుల వీరత్వం!

కొండ చీపుర్లూ
ఎండు చేపలూ
సంతలో గిరిజనులు!

జారుకొప్పులతో
జానెడు పైటలతో
వనవాసినులు - మునిబాలికలు!

చెకుముకిరాళ్లూ
మోదుగాకు చుట్టలూ
గుట్ట మనుషులు!

పిల్లంగ్రోవులూ
నెమలీకలూ
అడవి బాలలు!

విల్లంబులూ
గండ్రగొడ్డళ్లూ
ఆదిమవీరులు!

-మాల్యశ్రీ

అది మా ఆచారం, సంస్కృతి, పెద్దల పట్ల భక్తి, గౌరవం చూపడం మంచిదే కదా-'

'ఏం ఆచారమో, రోజూ ఇలా దండాలు పెట్టాలంటే ఎలా - నాకసలు అలవాటే లేదు-'

'సర్లే, అదో పెద్ద ఇష్యూలా ఇప్పుడు మాట్లాడాల్సిన విషయమా!' తేలిగ్గా కొట్టిపారేశాడు విశ్వాస్.

ఆ చిన్న చిన్న ఇష్యూలే కొద్దిరోజులలో పెద్దవయి మనశ్శాంతి హరించి, దూరాలు సృష్టిస్తుందని ఇద్దరూ ఆనాడు అనుకోలేదు.

❖❖❖

'పవిత్రా... సాయంత్రం ఫ్రీయేనా - ఎటైనా వెడదామా, నీతో కాస్త మాట్లాడాలి - బాబుని తీసుకుని లుంబినీ పార్కుకి రాగలవా, ఆదివారమేగా-' ఓ రెండు నెలల తరువాత విశ్వాస్ ఫోను చేశాడు. "బయటికా, నీవే ఇంటికి రాకూడదూ-' బిద్ధకంగా అంది పవిత్ర.

'లేదు, ఇంట్లో ఫ్రీగా మాట్లాడుకోలేం - ప్లీజ్ సాయంత్రంరా... పార్కులో కూర్చుని అలా ఎటైనా వెళ్లి డిన్నర్ చేసి వద్దాం, శ్రవణ్‌ని తీసుకురా-"

పార్కులో శ్రవణ్‌ని కాసేపు ముద్దుచేసి ఆడుకోడానికి వదిలి- 'పవిత్రా నాకు ఓ మంచి జాబ్ ఆఫర్ వచ్చింది. తీసుకుందామనుకుంటున్నాను-' ఉపోద్ఘాతంగా అన్నాడు విశ్వాస్.

'జాబ్ ఆఫరా, ఏం, వేరేచోట జాబ్ అవసరం ఏమొచ్చింది - ఎనీ ప్రాబ్లమ్-' ఆశ్చర్యంగా అంది.

"వేరేచోట జాబ్ తీసుకుంటే, వేరే ఇల్లు తీసుకు వుందామని...'

ఈసారి ఇంకా తెల్లబోతూ- 'వేరే వుంటావా. ఎందుకు, ఏమయింది. ఎందుకిలాంటి డెసిషన్ తీసుకున్నావు?

'నీ కోసం.. మన కోసం...' అన్నాడు. పవిత్ర మొఖం ఒక్క క్షణం ఎర్రబడి- 'హు నా కోసం ఈ నిర్ణయం అపుడు తీసుకుని వుంటే ఈ గొడవలే వుండేవిగావు - ఇప్పుడు తీసుకోడంలో అర్థం ఏమిటి?' నిష్ఠూరంగా అంది- 'టూ లేట్ విశ్వాస్' అంది.

'ప్లీజ్ పవిత్రా - అలా అనకు - బెటర్ లేట్ దేన్ నెవ్వర్' అన్నది నాకర్థం అయింది. నీకు దూరం అయి నేను సంతోషంగా లేను. ముఖ్యంగా శ్రవణ్‌ని ఎంత మిస్సవుతున్నానో నీకు తెలియదు ఈ ఏడాది నించి - మళ్లీ మనం కలిసి వుందాం పవిత్రా - నీ కంటె మంచి భార్య నాకు దొరకదు - నిన్ను పోగొట్టుకున్నాకే ఈ నిజం అర్థం అయింది. మన మధ్య స్నేహం, ప్రేమ ఇంకా మిగిలే వున్నాయని నా అభిప్రాయం - మన మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి గాని స్పర్థలు, కక్షలు లేవు - ఇంకో ప్రయత్నం చేద్దాం పవిత్రా... ఈ ఏడాదిలో ఇద్దరికిద్దరం విడిగా వున్నాం కనుక ఈసారి ఆ పొరపాట్లు దొర్లకుండా సర్దుకుపోయేందుకు ప్రయత్నిద్దాం-' సిన్సియర్‌గా అన్నాడు. పవిత్ర తల దించుకుని ఒక్క క్షణం ఆలోచనలో పడింది-

"మరి, మీ వాళ్లు దీనికి ఒప్పుకున్నారా?... చెప్పావా? ఏం అన్నారు?'

'ఒప్పుకోరు, ఏ పేరెంట్స్ ఒప్పుకోరు. అందులో మా బిజినెస్ కమ్యూనిటీలో కొడుకు వేరే వెళ్లడం అంటే అవమానంగా భావిస్తారు - అందుకేగా, పవిత్రా అప్పుడు అంత తెగించలేకపోయాను - ఆ కంపెనీలో పనిచేస్తూ, ఆ డబ్బు తింటూ పెళ్లవగానే వేరింటి కాపురం పెడితే బాధపడ్తారని, నీవక్కడ అడ్జెస్ట్ కాలేకపోతున్నావని తెల్సి ఇద్దరి మధ్య నలిగిపోయాను, సతమతమయ్యాను.

'మరిప్పుడు మాత్రం-' అనుమానంగా చూసింది.

'ఇప్పుడంటే బయట ఉద్యోగం చేసుకుంటే అంత గిల్టీగా ఫీలవక్కరలేదు' - నాన్నగారితో చెపితే ఆయన చాలా ఫీలయ్యారు - అమ్మయితే ఒకటే గోల, మనవాళ్ల అమ్మాయిని ఉద్యోగం చెయ్యని అమ్మాయిని చేసుకో అంటూ పోరు - నాన్నగారిని కన్విన్స్ చేయగలిగాను - ఆయన వేరే వెళ్లేందుకు ఒప్పుకున్నారు గాని, బిజినెస్‌లోంచి వేరయి ఇంకో ఉద్యోగానికి ఒప్పుకోవడం లేదు - బిజినెస్‌లో నీ షేర్ నీకుంటుంది - ఉద్యోగం ఇంకోచోట వద్దు నీకా అమ్మాయి ఇంకా కావాలనిపిస్తే అలాగే వేరే ఇల్లు తీసుకో - కాని అన్నీ జాగ్రత్తగా ఆలోచించు-' అన్నారు... 'అమ్మా నాల్గురోజులు బాధపడ్తుంది - ఆవిడా అర్థం చేసుకుంటుంది. అలవాటవుతుంది-

'నా కోసం మీ వాళ్లకి దూరమవడం, నేను గిల్టీగా ఫీలవుతాను-'

'అదే పవిత్రా నీలో నాకు నచ్చిన విషయం. నీవు నీకు నచ్చనిది జరిగినా ఇతరుల మీద నెపం నెట్టకుండా నేనే అడ్జస్ట్ అవలేకపోతున్నాను అనగలిగే గొప్ప గుణం వుంది. అదే ఇంకో అమ్మాయి అయితే మా అమ్మ, వదినల మీద ఎన్ని నేరాలు చెప్పేవారో - వాళ్లు నిన్ను అన్న మాటలకి ఎంతో హర్ట్ అయినా తప్పునాదే ఈ అలవాట్లు, పద్ధతులలో ఇమడలేకపోతున్నాను - మనం వేరే వెడితే గొడవలుండవు అని ఎంతో చెప్పావు - కాని నా రక్తంలో వున్న గుణం మార్చుకోలేక తల్లితండ్రుల మీద ఆధారపడుతూ వారిని కాదని బయటికి వెళ్లే సాహసం ఆనాడు చెయ్యలేక నిన్ను సపోర్టు చేయలేకపోయాను - కాని ఇప్పుడు నేనింక ఏ అమ్మాయినీ నీ స్థానంలో ఊహించలేను - నీవు దూరమయ్యాక గాని నీ విలువ అర్థం కాలేదు - అందుకే తెగించాను - నీవు బయటి ఉద్యోగం చెయ్యమంటే చేస్తాను, లేదంటే మా కంపెనీలోనే వుంటాను నాన్నగారి కోరిక ప్రకారం - పవిత్రా, నా అభ్యర్థనని కాదనకు. కనీసం శ్రవణ్ కోసమన్నా-' పవిత్ర చేయి చేతిలోకి తీసుకుని అభ్యర్థన పూర్వకంగా అన్నాడు - 'పవిత్ర ఐ లవ్ యూ -' నేను నిన్నెంతగా ప్రేమిస్తున్నానన్నది ఇపుడే నాకర్థం అయింది - పవిత్ర కళ్లలో తడి - విశ్వాస్ చేతి మీద చేయి ఆనించి 'నిజం చెప్పనా' - అసలు మనం విడిపోయాం అన్నది ఇప్పటికీ మైండ్‌లో రిజిష్టర్ అవలేదు తెలుసా - రాత్రి పడుకుంటే అసలు మనం ఎందుకు విడిపోయాం అని ఆలోచించేదాన్ని - 'ఇగో'ల క్లాష్ తప్ప ఇంకేం లేదనిపించేది - మొన్న మా మామ్మ ఒక మాట అంది, అది నన్ను చాలా ఆలోచింప చేసింది విశ్వాస్. 'పెళ్లి అనే పటాన్ని ఫ్రేములో బిగించి అద్దం కట్టిస్తేనే నాలుగు కాలాలు నిలుస్తుందే తల్లీ - ఫ్రేము, అద్దం లేకపోతే దుమ్ము ధూళి పడి బొమ్మ వెలిసి వంకరపోతుంది - భార్యాభర్తలిద్దరూ ఒక 'ఫ్రేము'లో వదిగి, ఇద్దరి 'ఇగో'లు అద్దం కింద దాచేస్తేనే ఫోటోలా కాపురం నిలుస్తుంది' అని ఎంత బాగా చెప్పిందో - ఆరోజు నించి నేనూ నీ గురించి ఆలోచిస్తున్నా-

'షి ఇజ్ ఎ గ్రేట్ లేడీ, పెద్ద వాళ్లు అనుభవం మీద చెప్పే పాఠాలు మన తరం వింటే సగం సమస్యలు రావు. ఆవిడకున్న జ్ఞానం ముందు మనమెంత'- అభిమానంగా అన్నాడు.

'నీవంటే మామ్మకెంత అభిమానమో - ఇలాంటి వాడెక్కడ దొరుకుతాడో నీకు అంటుంది.'

'ఐతే ముందు ఈ గుడ్ న్యూస్ ఆవిడకే చెప్పాలి' - విశ్వాస్ ఆనందంగా అన్నాడు.

❖❖❖

'మామ్మా, నేను మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాను-' పవిత్ర లోపలి కెడుతూనే హాల్లో కూర్చున్న మామ్మని కౌగలించుకుని సంతోషంగా అంది. విశ్వాస్ గుమ్మం దగ్గరే ఆగిపోయాడు - రాజ్యలక్ష్మి మొహం ముందు తెల్లబడి, తరువాత నల్లబడి ఆందోళనగా

'పెళ్లా - ఎవరూ - ఎవరిని... ఇంత హఠాత్తుగా.... ఎవరే తల్లీ నీకు దొరికిన ఆ మహానుభావుడు -' కాస్త అయిష్టత, విరక్తి కలిపి తన కిష్టం లేదన్న భావనని వ్యక్తం చేసింది.

'ఎంతో మంచివాడని నీవు సర్టిఫై చేసిన వాడేలే -' నవ్వుతూ కన్ను గీటింది. ఆవిడ తెల్లబోయి చూస్తుండగా విశ్వాస్ లోపలికొచ్చి ఆవిడకి పాదాభివందనం చేసి

'ఆ అదృష్టవంతుడిని నేనే దాదీజీ. మొదటిసారి తెలివి తక్కువగా జార్చుకున్న అదృష్టాన్ని మళ్లీ దక్కించుకున్నాను-' ఆవిడ ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయింది.

'ఇదిగో ఈ పాదాభివందనాలు చేసి చేసే మా మామ్మ దృష్టిలో మంచివాడయిపోయావు. ఆపింక నీ నాటకాలు-' కసిరింది విశ్వాస్‌ని - 'నోరు ముయ్యి - ఆ అబ్బాయిలో వున్న మంచిని ఇప్పుడైనా కళ్లిప్పుకుని సరిగా చూసి అర్థం చేసుకో - నీ ఇల్లు బంగారంకానూ ఒక్క నిమిషం హడలగొట్టేవు - మళ్లీ ఎవడ్ని ప్రేమించిందో మహాతల్లని గాభరాపడ్డాను-"

'అదే మామ్మా, ముప్పై ఏళ్లొచ్చాయి, మళ్లీ ఓనమాలు మొదలుపెట్టినట్టు ఇంకోడ్ని వెతుక్కుని, ప్రేమలు, దోమలు అంటూ షికార్లు తిరగడానికి ఓపిక లేకే ఏదో రాయి పళ్లూడగొట్టుకోడానికి - 'నోన్ డెవిల్ యీజ్ బెటర్' అనుకుని సరిపెట్టేసుకున్నాను, విశ్వాస్ అడగ్గానే చిలిపిగా నవ్వి అంది పవిత్ర-

'చూశారా దాదీజీ, నాకూ ఇంకో అమ్మాయిని వెతికే ఓపిక లేకే పవిత్రని అడిగితే పోజులు కొడుతోంది'- రాజ్యలక్ష్మి మనసారా నవ్వి, ఇద్దరి తలలు దగ్గిరికి తీసుకుని 'ఇలాగే పదికాలాల పాటు నవ్వుతూ వుండాలి' అంది ఆనందంగా.

■

## హైకూలు

సాహిత్య సభ
పరిచయాల తట్ట
లొట్టల ఊట
అరాచకత్వం
అనైక్యత ఘర్షణ
జీవుల జూదం
ఎడపెడలు
ఆయుధాల నిల్వలు
ఇద్దరం చద్దాం

-బివెందుప్రరా